ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.2, కనిష్ఠం 28.5
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
గురువారం 23 మే 2024



అతిథి ఉపాధ్యాయులకు దరఖాస్తుల ఆహ్వానం


మద్నూర్, మే 22: మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో 2024-25 సంవత్సరానికి 5 నుంచి ఇంటర్ వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధించేందుకు అర్హత గల వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్హతలున్న సర్టిఫికెట్లు జతచేసి 30వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. హిందీ, తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, గణితం, భౌతిక, వృక్ష, జంతు శాస్త్రం సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగి ఉండాలన్నారు. వివరాలకు 7331101386 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

అసలు డీఎంహెచ్‌వో.. ఎవరు!?

- ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని కొందరి ఉద్యోగుల లీలలు
- డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగా.. పద్మనా?
- పద్మ అనే డీఎంహెచ్‌వో ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండానే విధుల్లోకి చేరిన వైనం
- గూడుపుటాని నడిపించిన పలువురు ఉద్యోగులు
- అసలు డీఎంహెచ్‌వో పద్మ ఉండగా డీఎంహెచ్‌వోగా లక్ష్మణ్‌సింగ్ ఎలా కొనసాగాడు?
- గతంలో డీఎంహెచ్‌వోగా వచ్చి డిప్యూటేషన్‌పై వెళ్లిన పద్మ
- ప్రభుత్వం డిప్యూటేషన్‌లు క్యాన్సల్ చేయడంతో తిరిగి విధుల్లోకి
- గత రెండు నెలలుగా ఎవరికి తెలియకుండా విధుల నిర్వహణ
- ఈనెల 2న సెలవుపై వెళ్లిన డీఎంహెచ్‌వో పద్మ
- పూర్తి విచారణ చేస్తే అన్ని విషయాలు బట్టబయలు



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం



కామారెడ్డి టౌన్, మే 22: కామారెడ్డి వైద్య ఆరోగ్య శాఖలో అసలు డీఎంహెచ్‌వో ఎవరు లక్ష్మణ్‌సింగా.. లేదంటే పద్మనా? రోజుకో రకంగా మలుపులు తిరుగుతున్న వైద్య ఆరోగ్యశాఖలోని కొందరు ఉద్యోగుల పనితీరు. డీఎంహెచ్‌వోగా పద్మ అనే వ్యక్తి జాయినింగ్ రిపోర్టు ఇచ్చి గత రెండు నెలలుగా సంతకాలు పెడుతూ వెళ్తున్నా ఇక్కడ డీఎంహెచ్‌వోగా లక్ష్మణ్‌సింగ్ కొనసాగడంపై ఆంతర్యమేంటి అనేది అంతుచిక్కని ప్రశ్న. ఇప్పటికే లైంగిక వేధింపులతో వైద్య ఆరోగ్యశాఖపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతుంటే ఈ కొత్త వ్యవహారం కార్యాలయంలో మరింత చర్చకు దారి తీస్తోంది. పైగా ఈ విషయం జిల్లా ఉన్నతాధికారికి తెలియకుండా జరిగిదంటే ఏ స్థాయిలో ఉద్యోగులు వారి సొంత ఎజెండాను అమలు చేస్తూ వచ్చారో అర్థం చేసుకోవచ్చు. నిబంధనలను ఎక్కడ పట్టించుకోకుండా తమ ఇష్టారీతిన వ్యవహరిస్తూ ఇద్దరిద్దరు డీఎంహెచ్‌వోలు కొనసాగుతూ వచ్చారు. అందులో ఒక డీఎంహెచ్‌వో ఎఫ్‌ఏసీ(ఫుల్ అడిషనల్ చార్జ్) మీద రాగా మరో డీఎంహెచ్‌వో బదిలీపై వచ్చింది. బదిలీపై వచ్చిన డీఎంహెచ్‌వో అసలు జిల్లా ఉన్నతాధికారికి కనీస సమాచారం లేకుండా డీఎంహెచ్‌వో కార్యాలయానికి వచ్చి రిపోర్టు చేయడం ఆ తర్వాత డిప్యూటేషన్‌పై వెళ్లడం జరిగింది. ప్రభుత్వం డిప్యూటేషన్‌లు కాన్సల్ చేయడంతో మళ్లీ విధుల్లోకి చేరి రిజిష్టర్‌లో సంతకాలు చేస్తూ వెళ్లడం జరిగింది. ఈ తతంగం అంతా రెండు నెలల పాటు కొనసాగుతూ వచ్చినా కార్యాలయ సిబ్బంది కనీసం జిల్లా ఉన్నతాధికారికి సమాచారం ఇచ్చిన దాఖలాలు లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అసలు డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగా.. పద్మనా?

కామారెడ్డి వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కొందరు ఉద్యోగుల గూడుపుటాని పలువురుని ముక్కున వేలెసుకునేలా చేస్తోంది. ఒకే పోస్టులో ఇద్దరు డీఎంహెచ్‌వోలు కొనసాగగా ఇందులో ఒకరు ప్రత్యేకంగా కనిపించే డీఎంహెచ్‌వో.. మరొకరు పరోక్షంగా కార్యాలయంకు వచ్చి వెళ్లే డీఎంహెచ్‌వోలు ఉందనే విషయం వింటే అందరికీ ఆశ్చర్యం కలుగకమానదు.

కొందరు రాష్ట్రస్థాయిలోని ఉద్యోగుల మద్దతుతో రహస్యంగా ఇద్దరు డీఎంహెచ్‌వోలు వారికి నచ్చిన విధంగా విధులు నిర్వహిస్తూ వచ్చారు. 2022 ఫిబ్రవరిలో డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహించిన కల్పన కంటేను ప్రభుత్వానికి కలెక్టర్ సరెండర్ చేసిన తర్వాత ప్రస్తుతం పని చేస్తున్న లక్ష్మణ్‌సింగ్ ఫుల్ అడిషనల్ చార్జ్‌తో డీఎంహెచ్‌వోగా విధుల్లో చేరాడు. ఆ తర్వాత 2023 ఫిబ్రవరిలో డీఎంహెచ్‌వోగా డాక్టర్ పద్మను నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. సదరు డీఎంహెచ్‌వో పద్మ కామారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయంలో రిపోర్టు చేసి డిప్యూటేషన్‌పైన హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. సాధారణ ప్రోటోకాల్ ప్రకారం ఈమె కామారెడ్డి డీఎంహెచ్‌వోగా రిపోర్టు చేసినప్పుడు జిల్లా కలెక్టర్‌ను కలిసి జాయిన్ కావాలి కాని ఈమె ఎక్కడ కలెక్టర్‌ను కలిసిన దాఖలాలు లేవని సమాచారం. ఒకవేళ ఆమె చార్జ్ తీసుకుని ఉంటే ప్రజా సంబంధాల అధికారి అయిన లేదంటే వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని డెమో సెక్షన్ అధికారులైన ప్రజలకు తెలిసేలా మీడియాకు సమాచారం అందించాల్సి ఉంటుంది. అసలు వారు సైతం ఎక్కడ సమాచారం ఇచ్చిన దాఖాలాలు లేవు. ఎందుకంటే ఈ విషయం ఎక్కడ పొక్కనివ్వకుండా కొందరు ఉద్యోగులు జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. అదికాక కనీసం కలెక్టర్‌కు సదరు కార్యాలయ సిబ్బంది తెలియజేయాల్సి ఉన్నా ఆయన దృష్టికి తీసుకుపోయిన దాఖాలాలు లేవని సమాచారం. జాయిన్ అయిన వెంటనే ఆమె డిప్యూటేషన్‌పై హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. ఇటీవల ప్రభుత్వం డిప్యూటేషన్‌లు క్యాన్సల్ చేయడంతో తిరిగి గత రెండు నెలల క్రితం విధుల్లోకి చేరింది. అప్పుడైనా కలెక్టర్‌కు కనీస సమాచారం ఇవ్వలేదని సమాచారం. పైగా గత రెండు నెలలుగా కార్యాలయానికి వచ్చి వెళ్లి ఈనెల 2న మెడికల్ లీవ్ అంటూ వెళ్లిపోయింది. ఆమె డీఎంహెచ్‌వోగా పనిచేస్తే ఇక్కడ లక్ష్మణ్‌సింగ్ ఎందుకు విధుల్లో కొనసాగాడు.. లేదంటే ఆమె డీఎంహెచ్‌వో కాకపోతే ఎందుకు ఇక్కడ విధుల్లో చేరిందనేది సొంత శాఖలోని ఉద్యోగులకే తెలియని పరిస్థితి.

గూడుపుటాని నడిపిన కొందరు ఉద్యోగులు?

డీఎంహెచ్‌వోగా లక్ష్మణ్‌సింగ్ వచ్చిన కొద్దిరోజులకే రాష్ట్ర ప్రభుత్వం డీఎంహెచ్‌వోగా పద్మను నియమించింది. జిల్లా ఉన్నతాధికారికి సమాచారం ఇవ్వకుండానే విధుల్లోకి చేరి డిప్యూటేషన్‌పై వెళ్లిపోయింది. ఇక్కడ నుంచే జీతాలు సైతం పొందుతూ వచ్చింది. ప్రభుత్వం డిప్యూటేషన్‌లు క్యాన్సల్ చేయగానే మళ్లీ విధుల్లోకి చేరింది. ఆమె విధుల్లో చేరినప్పుడు జిల్లా ఉన్నతాధికారికి చెప్పాల్సి ఉండగా ఆయనను కలిసిన దాఖాలాలు లేవు. ఒకవేళ ఆమె విధుల్లో కొనసాగితే ఇక్కడ ఎఫ్‌ఏసీ మీద వచ్చి విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్‌సింగ్ ఇక్కడి నుంచి వెళ్లిపోవాల్సి ఉండగా ఎందుకు కొనసాగుతూ వచ్చాడనే వాటికి సమాధానాలు లేకుండా పోతున్నాయి. అయితే ఆమె విధుల్లో చేరిన విషయం ఎక్కడ పొక్కకుండా ఓ ఒప్పందం కుదుర్చుకున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకు కొందరు ఉద్యోగులు గూడుపుటాని నడిపి తమ వంతు సహాయం అందించారని సమాచారం. 10 రోజులకు ఒకసారి డీఎంహెచ్‌వో పద్మ వచ్చి సంతకాలు పెట్టి వెళుతూ వచ్చింది. ఈ విషయం ఎక్కడ బయటపడకుండా ఉంటుందని తమకు ఏ ఇబ్బంది లేదని ఆలోచన చేస్తున్న తరుణంలో ఇటీవల మహిళ ఉద్యోగులపై వేధింపుల వ్యవహారం బయటపడింది. ఈనెల 8న డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ ఓ సమావేశంలో ఉద్యోగులపై అసభ్యపదజాలం ఉపయోగించారని ఆరోపణలు వెలువడడం, ఉద్యోగులు నొచ్చుకుని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే వరకు వ్యవహారం వెళ్లింది. ఇక్కడే ఆమెకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించిన పలువురు ఉద్యోగులు ఈ విషయం ఎక్కడ బయటపడుతుందోనని ఆమెకు సమాచారం చేరవేయడంతో ఈనెల 2నే సెలవుపై వెళ్లినట్లు లీవ్ లెటర్ పెట్టి వెళ్లిపోవడం చకచక జరిగిపోయాయి.

పూర్తి విచారణ చేపడితే అన్ని విషయాలు బట్టబయలు

జిల్లా స్థాయిలో ఉన్నతాధికారి ఉండగా ఆయనకు తెలియకుండా ఇద్దరు డీఎంహెచ్‌వోలు కొనసాగడం, విషయం బయటకు పొక్కకుండా కొందరు ఉద్యోగులు తమ ఇష్టారీతిన వ్యవహరించడంలో కొందరు రాష్ట్రస్థాయి ఉద్యోగుల సహాయ సహకారాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీఎంహెచ్‌వోగా పద్మ ఉండగా లక్ష్మణ్‌సింగ్ ఎందుకు కొనసాగాడు.. ఆమె ఎందుకు గోప్యంగా విధులు నిర్వహించాల్సి వచ్చింది.. పది రోజులకు ఒకసారి వచ్చి ఎందుకు రిజిష్టర్‌లో సంతకాలు చేయాల్సి వచ్చింది.. ఒక వేళ ఆమె విధులు నిర్వహించకుంటే మొదటి నుంచి ఆమెకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో పని చేస్తున్నట్టు జీతాలు ఎందుకు చెల్లించారనే దానిపై పూర్తి విచారణ చేపడితే అన్ని విషయాలు బట్టబయలు పడే అవకాశాలు ఉన్నాయి. అయితే ఈ విషయంపైన పలువురు ఉద్యోగులు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ దృష్టికి తీసుకుపోయేందుకు సిద్ధమైన్నట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, మే 22: రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, రాష్ట్ర రహదారుల ఇంజనీరింగ్ అధికారులు, పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ సింధూశర్మతో కలిసి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదాలు, రోడ్డు నిర్మాణంలో కొన్ని లోపాల వల్ల ప్రమాదాలు జరుగుతూ మృత్యువాత పడుతుండడం బాధకరమన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించేలా చూడాలని తెలిపారు. జిల్లాలో జాతీయ రహదారి 60 కిలో మీటర్ల మేర ఉందని దగ్గి, సదాశివనగర్, భిక్కనూర్ టోల్‌ప్లాజా, ఆర్‌టీఏ చెక్‌పోస్ట్, టెక్రియాల్ తదితర ప్రాంతాల్లో తరచుగా రోడ్డు ప్రమాదాల వల్ల మృత్యువాత పడుతున్నారని అన్నారు. గత సంవత్సరం జిల్లాలో 550 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ప్రమాదాలకు గల కారణాలను క్షుణంగా తెలుసుకుని నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా బ్లాక్ స్పాట్‌లను గుర్తించడంతో పాటు స్పీడ్ బ్రేకర్లు, రుంబుల్ స్ట్రిప్స్, బారీకేడింగ్, స్టడ్స్, బ్లింకర్స్ కల్వర్టుల వద్ద రేడియం స్టిక్కర్లు, మలుపుల వద్ద సూచిక బోర్డులు, బాణం గుర్తులు తదితర వాటిని ఏర్పాటు ప్రాంతాలను గుర్తించి తగు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. బైపాస్ రోడ్డు నుంచి ప్రధాన రహదారి పైకి వచ్చే మార్గంలో స్పీడ్ బ్రేకర్‌లు నిర్మించాలని, అత్యవసర సమయంలో వాహనాలు రహదారి పక్కన ఆపడానికి తగు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రమాదం జరిగిన గంట సమయం గోల్డెన్ పీరియడ్ అని, తక్షణ వైద్య సహాయం అందేలా చూడాలని, వెంటిలేటర్‌తో అంబులెన్స్ సిద్ధంగా ఉండాలని తెలిపారు. రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతి ఒక్కరూ మానవత దృక్పథంతో బాధితులకు సహాయం చేయాలని, 108 అంబులెన్స్‌కు కాల్ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ కాజల్, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, నేషనల్ హైవే రెసిడెంట్ ఇంజనీర్ రామారావు, టోల్‌గేట్ ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ రవిశంకర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాంసింగ్, సేవ్ లైఫ్ ఫౌండేషన్ సీనియర్ అసోసియేట్ నూర్‌ఖేతార్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

మిగిలిన ధాన్యాన్ని శనివారం లోపు అన్‌లోడింగ్ చేసుకోవాలి

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చివరి దశకు వచ్చిందని, మిగిలిన ధాన్యాన్ని శనివారం లోపు అన్‌లోడింగ్ చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ రైస్‌మిల్లర్లను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో రైస్‌మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 90 శాతం ధాన్యం సేకరణ పూర్త యిందని తెలిపారు. ఇంకా 30,137 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే మిగిలి ఉందని తెలిపారు. మిల్లుల సామర్థ్యం ఎంత, ఎంత ధాన్యం దించుకున్నారో రాష్ట్రస్థాయి విజిలె న్స్ బృందాలు నిశితంగా పరిశీలిస్తున్నామని, వారికి అవకాశం ఇవ్వకుండా త్వరిత గతిన అట్టి ధాన్యం దించుకోవాలని రైస్‌మిల్లర్లను కోరారు. తహసీల్దార్లు, వ్యవసా యాధికారులు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌లు, కొనుగోలు కేంద్ర నిర్వాహకులను సమన్వయం చేసుకుంటూ లారీల్లో ధాన్యం లోడింగ్ చేసి పంపుతారని, మిల్లు ల్లో స్థలా భావం ఉంటే గోదాముల్లో సర్దుబాటు అవకాశం ఉన్న దగ్గర ధాన్యం అన్‌లోడ్ చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. లక్ష్యం మేరకు ధాన్యం అన్‌లోడ్ చేసుకున్న మిల్లులకే వచ్చే ఖరీఫ్ సీజన్ ధాన్యం కేటా యిస్తామని ఇది గుర్తెరిగి త్వరితగతిన ధాన్యం దించుకోవాలని తెలిపారు. బాన్సువాడ డివిజన్‌లోని కొమలంచ, అచ్చంపేట తదితర ప్రాంతాల్లో 5,700 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని, డివిజన్‌లోని 11 రైస్‌మిల్లర్లు 500 మెట్రిక్ టన్నుల చొప్పున శనివారం వరకు ధాన్యం దించుకో వాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఎస్‌వో మల్లికార్జున్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు మెరుగైన విద్యను అందించిన మహనీయుడు భాగ్యరెడ్డివర్మ

అణగారిన వర్గాలకు మెరుగైన విద్యను అందించి విద్యా విప్లవం సృష్టించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బుధవారం ఆయన 136వ జయంతి సందర్భంగా ఎస్సీ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బాలికల కోసం పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశారని అన్నారు. ఆయన ఆశలకనుగుణంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రజిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, గిరిజనాభివృద్ధి అధికారి అంబాజీ, సీపీవో రాజారాం తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ హాలీం సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నతాధికారులు

బాన్సువాడ, మే 22: బాన్సువాడ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న హాలీంను సస్పెండ్ చేస్తూ నిర్మల్ జిల్లా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ దివ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హాలీం గతంలో నిర్మల్ జిల్లా భైంసా మున్సిపాలిటీ కమిషనర్‌గా పని చేశారు. భైంసా మున్సిపాలిటీలో కమిషనర్‌గా పని చేస్తున్న సమయంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అక్రమ నియామకాలకు తెర లేపడమే కాకుండా మున్సిపాలిటీ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ప్రభుత్వ స్థలాలకు అక్రమ అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో భైంసా మున్సిపాలిటీ కమిషనర్ హాలీం అవినీతి బాగోతాలు వెలుగు చూశాయి. వీటిపై సమగ్రంగా విచారణ జరిపిన అధికారులు.. ఉన్నత అధికారులకు నివేదిక సమర్పించారు. దీంతో కామారెడ్డి జిల్లా బాన్సువాడ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న హాలీంను సస్పెండ్ చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ దివ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా తన సస్పెన్షన్ విషయమై హాలీం కోర్టును ఆశ్రయించి.. స్టే తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

మరో 13 రోజులు.. టెన్షన్ టెన్షన్!

- ఎన్నికల ఫలితాల కోసం ఎదురు చూపు
- గెలుపోటములపై అంచనాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు

నాగిరెడ్డిపేట, మే 22: లోక్‌సభ ఎన్నికలు ఎట్టకేలకు చూస్తుండగానే ఐదు విడతల్లో పూర్తయ్యాయి. రాష్ట్రంలో నాలుగో విడతల్లో భాగంగా ఈనెల 13న ఎన్నికలు జరుగగా ఓటర్లు తమ తీర్పును ఇచ్చి తమ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎన్నికల్లో పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు, అభ్యర్థుల గెలుపు కోసం నిరంతరం పని చేసిన ప్రధాన పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాత్రం ఎన్నికల ఫలితాలపై నిత్యం టెన్షన్ టెన్షన్ మొదలైంది. తమ పార్టీ అభ్యర్థి ఎన్నికల్లో గెలుపొందుతారో లేదోనని ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు తర్జన భర్జనలో మునిగిపోయారు. ఈసారి శాసనసభ ఎన్నికల్లో ఫలితాలు తారుమారు కావడం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకోవడం జరిగింది. దీంతో పార్లమెంట్ ఎన్నికలు సైతం ఉత్కంఠగానే జరిగాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వల్ల ఎన్నికల ఫలితాలు గంటల్లోనే వెల్లడి కానుండగా దేశ వ్యాప్తంగా పలు దశల్లో జరుగుతున్న ఎన్నికలు పూర్తయితే గాని కౌంటింగ్ జరిగే ప్రసక్తి లేదు. దేశ వ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికలు జరుగుతుండగా ఇప్పటికే ఐదు దశల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. మిగతా రెండు దశల్లో ఎన్నికలు జరిగాక జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ జరగనుంది. దీంతో ఇంకా 13 రోజులు నిరీక్షణ తప్పడం లేదు. ఈ 13 రోజులు ఎన్నికల బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు నిత్యం టెన్షన్ టెన్షన్‌గా గడుపుతు న్నారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో 74.63 శాతం ఓటింగ్ జరిగింది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 16,41,410 ఓట్లు ఉండగా అందులో 12,25,049 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషుల ఓట్లు మొత్తం 8,01862 ఉండగా 6,08,097 పోలయ్యాయి. మహిళల ఓట్లు మొత్తం 8,39,489 ఉండగా 6,16,936ఓట్లు పోలయ్యాయి. పురుషుల ఓట్ల కంటే మహిళల ఓట్లు 8,839 ఓట్లు అధికంగా పోలయ్యాయి. ఈసారి ఓటింగ్ శాతం జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో పట్టణాల కంటే పల్లెల్లో పెరగడం, మహిళా ఓట్లు అధికంగా పోల్ కావడంతో ఫలితాలు ఎవరికి అనుకూలంగా వస్తాయోనన్న చర్చ నలుగురు కలిసిన ప్రతీచోట జరుగుతుంది.

క్రాస్ ఓటింగ్, సైలెంట్ ఓటింగ్ ఎవరికి కలిసోస్తుందో..?

జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రధాన పార్టీలు గెలుపు తమదంటే తమదంటూ గెలుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈసారి జరిగిన జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్‌లో క్రాస్ ఓటింగ్‌తో పాటు సైలెంట్ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. దీంతో ఈ క్రాస్ ఓటింగ్ సైలెంట్ ఓటింగ్ ఏ పార్టీకి కలిసోస్తుందో? ఎవరి కొంప ముంచుతుందోనని ప్రధాన పార్టీలు. ఎన్నికల బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు తలలు పట్టుకొంటున్నారు. నిత్యం టెన్షన్.. టెన్షన్‌తో గడుపుతున్నారు. ఎవరి కలలు నిజమవుతాయన్నది మరో 13 రోజుల నిరీక్షణ తరువాత జరిగే ఓట్ల లెక్కింపుతో తేలనుంది.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయంటున్న కాంగ్రెస్

ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూలమైన పవనాలు వీస్తున్నాయని, ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకుంటున్నారని, రాష్ట్రంలో మెజారిటీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోబోతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ గెలుపుపై సంపూర్ణ విశ్వాసంతో ఉందని, ఆ పార్టీ నాయకులంటున్నారు. ముస్లింలు, క్రిస్టియన్‌లు, దళితులు, రైతులు, మహిళలు, యువత ఓట్లు తమకు ఏకపక్షంగా పోలయ్యాయని అంటున్నారు. రాష్ట్రంలో ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తూ కాంగ్రెస్‌కు ఓటు వేయడం తమకు కలిసోస్తుందంటున్నారు. జహీరాబాద్ స్థానం కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు.

తమదే విజయమంటున్న కమలనాథులు

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు నరేంద్రమోదీని తిరిగి ప్రధానిగా చూడాలని కోరుకుంటున్నారని, ఆ మేరకు రాష్ట్రంలో మోదీ పవనాలు వీచినందున మత పార్టీ ఘన విజయాన్ని సాధిస్తుందని బీజేపీ నేతలంటున్నారు. హిందూ వర్గాల్లోని ఓట్లు తమకు అనుకూలంగా పడ్డాయని, బీజేపీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీకి అనుకూల వాతావరణం ఉన్న నేపథ్యంలో జహీరాబాద్ నియోజవర్గంలో బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ వైపే ప్రజలు

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీ వైపే ఉండి, బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేశారని పార్టీ వర్గాలు అంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలను గుర్తించిన ప్రజలు, రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన బీఆర్‌ఎస్ పార్టీకే ఓటేశారని ఆ పార్టీల నేతలంటున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలుపు ఖాయమని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

● నలుగురికి వారం రోజుల జైలు శిక్ష

ఖిల్లా, మే 22: మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందిని గుర్తించి వారిని కోర్టు ఎదుట హాజరు పర్చడం జరిగిందని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. పోలీసు కమీషనర్ కల్మేశ్వర్ సింగనేవార్ ఆదేశాల మేరకు ప్రతి రోజు వాహనాలను ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వి.వెంకటనారయణ నేతృత్వంలో ట్రాఫిక్ ఎస్‌ఐలు, సిబ్బందిలు తనిఖీ చేపడ్తున్నామన్నారు. బుధవారం నగరంలో వాహనాలను తనిఖీలు చేస్తుండగా వారిలో 13 మంది మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు గుర్తించామాన్నారు. వీరిని కోర్టు ఎదుట హాజరు పర్చగా మెజిస్ట్రేట్ ఎంఎం.అలీసిరాజ్ 9 మందికి రూ.15,500లు జరిమాన విధించి మరో నలుగురికి 7 రోజుల చొప్పున జైలు శిక్షను విధించినట్లు ట్రాఫిక్ ఏసీపి. బి.నారయణ తెలిపారు.

భద్రాద్రిలో మాజీ ఎమ్మెల్సీ దంపతుల పూజలు

నిజామాబాద్ అర్బన్, మే 22: మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత రాఘువేందర్ దంపతులు బుధవారం భద్రాచలంలోని శ్రీ కోదండ రామాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవాలని ప్రత్యేక పూజలు చేసినట్లు వారు తెలిపారు. వారి వెంట సీనియర్ నాయకుడు బంటు బలరాం దంపతులు ఉన్నారు.

అనుమతులు లేని పాఠశాలల విషయంలో జాగ్రత్తగా ఉండండి : డీఈవో

● పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్‌ల అమ్మకాలు నిషేధం

నిజామాబాద్ అర్బన్, మే 22: జిల్లాలోని విద్యార్థులు, తల్లిదండ్రులు ఏదైనా పాఠశాలలో అడ్మిషన్ పొందే ముందు ఆ పాఠశాలకు అనుమతి ఉన్నది లేనిది సంబంధిత మండల విద్యాశాఖ కార్యాలయంలో తెలుసుకొని ప్రవేశం పొందాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు చేస్తున్న పాఠశాలలను గుర్తించి వాటిని మూసివేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఇదివరకే మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించామని జిల్లాలో అనుమతి పొందకుండా ప్రవేశాలు తీసుకుంటున్న పాఠశాలల ప్రచార బోర్డులను, బ్యానర్‌లను ఇప్పటికే తొలగించడం జరిగిందని ఆయన తెలిపారు.విద్యార్థులు, తల్లిదండ్రులు ఏదైనా పాఠశాలలో ప్రవేశం తీసుకునే ముందు ఆ పాఠశాలకు గుర్తింపు ఉన్నది లేనిది తెలుసుకోవాలని అది తల్లిదండ్రుల బాధ్యత అని ఆయన అన్నారు. జిల్లాలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు, వేసవి తరగతులు, పాఠశాలల్లోనే యూనిఫామ్‌లు, బెల్టులు, పుస్తకాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని అదే విధంగా 70 శాతం ఫీజు ముందే చెల్లించాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసిందని కావున ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న పాఠశాలల విషయం తమ దృష్టికి వస్తే ఎటువంటి నోటీసు జారీ చేయకుండా ఆ పాఠశాల అనుమతులను రద్దు చేయడం జరుగుతుందని డీఈవో తెలిపారు.

ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం

● ఆరు గ్రామాలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

సిరికొండ, మే 22: సిరికొండ మండలంలో తొమ్మిది గ్రామాల్లో బలమైన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బుధవారం సాయంత్రం కురిసింది. సుమారు 20 నిమిషాల పాటు విపరీతమైన గాలులతో కూడిన భారీ వర్షం కురవడం వల్ల పలు గ్రామాల్లో చెట్లు విరిగి విద్యుత్ స్థంభాలపై పడటం వల్ల కరెంట్ నిలిచిపోయింది. సిరికొండ బస్టాండ్ సమీపాన వేపచెట్టు, పోలీస్ స్టేషన్‌లో రెండు చెట్లు, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఒక చెట్టు, హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద చెట్టు విరిగిపోవడం వల్ల సుమారు 2గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సిరికొండ, మైలారం, కుర్దుల్‌పేట్, రావుట్ల, న్యావనంది, హుస్సేన్‌నగర్, రామడుగు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అందకారం ఏర్పడింది. విద్యుత్ పునరుద్దరించడం కోసం ట్రాన్స్‌కో సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మైలారం గ్రామంలో ప్రధాన రోడ్లపై చెట్లు విరగడం వల్ల అక్కడ విద్యుత్ సరఫరా చేయడంలో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని గ్రామస్తులు తెలిపారు.

పెళ్లికి నిరాకరించిందని యువకుడి ఆత్మహత్య

నిజామాబాద్ అర్బన్, మే 22: తను ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించడంతో మనస్థాపానికి గురై నగరంలోని అరుంధతి నగర్‌కు చెందిన ప్రమోద్‌కుమార్ (24) ఆత్మహత్య చేసుకున్నాడు. మూడో టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని అరుంధతినగర్‌లో ఉండే ప్రమోద్ పేయింటర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన యువతితో ప్రేమలో ఉన్న ఆయన యువతిని పెళ్లి చేసుకోవాలని కోరడంతో ఆమె పెళ్లి చేసుకునేందుకు నిరాకరించడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు తల్లి రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దేగాంలో నర్సరీ పరిశీలన


దేగాంలో నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

ఆర్మూర్‌రూరల్, మే22: ఆర్మూర్ మండలం దేగాం గ్రామంలో బుధవారం పల్లె ప్రకృతి వనం, నర్సరీ, కంపోస్టు షెడ్డు, వైకుంఠ ధామాలను జిల్లా పంచాయతీ అధికారి సీహెచ్.తరుణ్‌కుమార్ పరిశీలించారు. నర్సరీలో జర్మినేషన్ రాణి బెడ్స్‌లో కొత్తగా నారు నాటించాలని, అవెన్యూ రోడ్స్‌లో మొక్కలు లేని చోట వర్షాలు కురిసిన వెంటనే కొత్త మొక్కలు నాటించాలని అన్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలను వెంటనే వెంటనే శుభ్రం చేయించాలని పంచాయతీ కార్య దర్శి దేవేం దర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో శివకృష్ణ, ఆర్మూర్ ఎంపీవో శ్రీనివాస్‌లు ఉన్నారు.

పరమేశ్వర మందిరంలో సప్తాహ


బరంగేడ్గిలో సప్తహ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బీర్కూర్, మే 22 : బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలోని పరమేశ్వర మందిరంలో అఖండ శివనామ సప్తహా పరమ రహస్య పారాయణ మహోత్సవం కార్యక్రమం కొనసాగుతుంది. స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, ప్రవచన కారులు, కీర్తన కారులు హాజరయ్యారు. ప్రవచన కారులు అధ్యాత్మిక ప్రవచనాలు, కీర్తన కారులు, శివ కీర్తనలు పాడారు. ప్రవచనాలు, కీర్తనలు భక్తులు భక్తి శ్రద్దలతో శ్రవణం చేశారు. ఇదిలా ఉండగా బుధవారం హిందూ ధర్మ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణంస్వామి సప్తహాలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రవచనాలు చెప్పారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని పిలుపు నిచ్చారు. భక్తి మార్గంలో నడిచే వారు ఎల్లప్పుడు శాంతంగా, సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న నాటి నుంచి మన సంస్కృతి సాంప్రదాయాలను అలవాటు చేయాలని, వాటి విశిష్టను తెలియ జెప్పాలన్నారు. హిందూ ధర్మం విశ్వశాంతిని కోరుకుంటుందన్నారు. ప్రతి ఒక్కరు ప్రతిరోజు కొంత సమయాన్ని శివనామ స్మరణకు కేటాయించాలన్నారు. శివనామ స్మరణ వల్ల సుఖ శాంతులు, సంపూర్ణ ఆరోగ్యం, ఐశ్వర్యం, కీర్త, ప్రతిష్టలు లభిస్తాయని అన్నారు. మానవుడికి ముక్తి లభించాలంటే భక్తి ఒక్కటే మార్గమన్నారు.

ఖరీఫ్ సీజన్‌లో రూ.2లక్షల రుణమాఫీ చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

మోపాల్, మే 22: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రుణమాఫీని ఈ ఖరీఫ్ సీజన్‌లో 2లక్షల రూపాయలను ఒకేసారి మాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతుకూలీ సంఘం (ఏఐపీకేఎస్) నాయకులు బుధవారం మోపాల్ తహసీల్దార్ రామేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఖరీఫ్ సీజన్‌లో ఏకకాలంలో రైతులకు 2లక్షల రుణమాఫీ చేయాలని అన్నారు. అన్ని రకాల పంటలకు అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, మందులు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, రూ.500ల బోనస్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడగండ్ల వర్షానికి నష్టపోయిన రైతులందరికి ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాయాగౌడ్, గంగమల్లు, గంగారాం, గంగాధర్, సాయిలు, రవి, పోశన్న, తదితరులు ఉన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి


ఏర్గట్ల అధికారులతో మాట్లాడుతున్న అదనపు జిల్లా కలెక్టర్ అంకిత్

ఏర్గట్ల, మే 22: మండలంలో ఎంపికైన అమ్మ ఆదర్శ పాఠశాలను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. మండలంలోని తొర్తి, గుమ్మి ర్యాల్, ఏర్గట్లలోని పాఠశాలలను సందర్శించి జరుగుతున్న పనుల పురోగతిపై వివరాలు తెలుసుకొని పనులు పూర్తి చేయాలని ఎంఈవో ఆంధ్రయ్యకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శివచరణ్, సీసీ సంతోష్, కార్యదర్శి జాకీర్ హుస్సేన్‌లు పాల్గొన్నారు.

రామాలయానికి మకర తోరణం వితరణ


రామాలయంలో అలంకరించిన మకర తోరణం

నవీపేట,మే22: మండల కేంద్రంలో ఇటీవల పునర్నిర్మాణం చేసి శ్రీరామాలయానికి నవీపేటకు చెందిన యెర్ర ఆనంద్ కుమార్, అర్చన దంపతులు మకర తోరణాన్ని బుధవారం వితరణ చేశారు. సుమారు రూ.30వేల విలువైన మకర తోరణాన్ని ఆలయానికి అందించినట్లు దాతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవీపేట,మే22: నిర్మల్ జిల్లా బాసర రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడ్డ మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ తెలిపారు. మృతుడికి సుమారు 55 సంవత్సరాల వయసు ఉంటుందని, అతడు నీలిరంగు గీతల షర్టు, లుంగీ ధరించి ఉన్నాడని, అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని ఆయన పేర్కొన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఆయన తెలిపారు.

ఆర్టీఏ చెక్ పాయింట్‌లో ప్రైవేటు సిబ్బంది ?

● వారికి ఏమైనా జరిగితే ఎవరిది బాధ్యత ● ఇటీవల ఎక్కువగా జరుగుతున్న ప్రమాదాలు ● బ్లాక్ స్పాట్‌గా గుర్తింపు


జంగంపల్లి శివారులో ఆర్టీఏ చెక్‌పాయింట్

భిక్కనూరు, మే 22: భిక్కనూరు జంగంపల్లి శివారులో 44వ జాతీయరహదారిపై ఉన్న ఆర్టీఏ చెక్‌పాయింట్‌లలో అధికారులు, సిబ్బందితో పాటుగా దాదాపు 10మంది వరకు 24గంటల పాటు షిఫ్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తుంటారు. ఈ చెక్‌పాయింట్ వద్ద రోడుక్కు ఇరువైపులా చేతిలో విజిల్ పట్టుకుని ఎండ, వానతో సంబంధం లేకుండా వీరు వాహనాలను ఆపుతుంటారు. వీరు ప్రతీరోజు ఉదయం 8గంటల నుండి మరుసటీ రోజు ఉదయం 8గంటల వరకు (24గంటలు) విధులు నిర్వహిస్తారు. ఇలా 24గంటలు విధులు నిర్వహించిన వారికి ఆసమయంలో ఆర్టీఏ చెక్‌పాయింట్‌లలో విధులలో ఉన్న అధికారులు ఉదయం టిఫిన్‌తో పాటుగా భోజన సౌకర్యం కల్పించి రూ.2వేల నుంచి రూ.2500ల వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. అసలు ఈ చెక్‌పాయింట్‌లలో ప్రైవేటు సిబ్బందిని ఇలా నియమించుకోవచ్చునా, ఒకవేళ నియమించుకుంటే వీరిని ఎవరు నియమిస్తారు, జీతాలు ఎవరు చెల్లిస్తారు, వీరికి ఎమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్నది మిలియన్‌డాలర్ ప్రశ్న. ఒకవేళ ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు సిబ్బందికి ఏమైనా జరగరానిది జరిగితే కుటుంబ పెద్దను కోల్పోయి వారి కుటుంబ రోడ్డున పడే పరిస్థితి. కాగా విధులు నిర్వహించాల్సిన సిబ్బంది కంటే ఎక్కువగా ప్రైవేటు సిబ్బంది ఎలాంటి డ్రెస్‌కోడ్ లేకుండా విధులు నిర్వహిస్తుండటంతో ఎక్కువగా వాహనదారులతో గొడవలు, ప్రమాదాలు లాంటివి జరుగుతున్నాయి. తప్పని పరిస్థితుల్లో ఇక్కడ పనిచేస్తున్న ప్రైవేటు వ్యక్తులు అరచేతిలో ప్రాణాలను పెట్టుకుని ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఇటీవల చెక్‌పాయింట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ప్రమాదానికి కారణమైన లారీ ఆచూకీ ఇప్పటికీ లభించలేదు.

● ఇటీవల ఎక్కువగా జరుగుతున్న ప్రమాదాలు...

ఈ చెక్‌పాయింట్ వద్ద విధులు నిర్వహించే ప్రైవేటు సిబ్బంది రోడుకు ఇటువైపు, అటు వైపు ఎక్కువగా తిరగడం, రోడ్డుపై వాహనాల ను నిలపడం కారణంగా ఇటీవల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో అధికారులు ఈ ప్రాంతాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో చాలాప్రమాదాలు జరగగా పలువురు మరణించగా, చాలామంది గాయపడ్డ సంఘటనలు ఉన్నాయి. రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో సైతం జిల్లా అధికారులు సైతం ఆర్టీఏ చెక్‌పాయింట్ వద్ద రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అక్కడ రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించిన పరిస్థితి ఉంది.

● చెక్‌చెక్‌పాయింట్‌పై గతంలో ఏసీబీ దాడులు

జంగంపల్లి శివారులోని ఈ ఆర్టీఏ చెక్‌పాయింట్‌పై గతంలో ఏసీబీ దాడులు, ఈ చెక్‌పోస్టును ఇక్కడి నుండి తరలించాలని జంగంపల్లి గ్రామస్థులు ఆందోళనలు చేసిన సంఘటనలు ఉన్నాయి. అయిన అధికారుల్లో మార్పు రావడం లేదు. నిత్యం వాహనాలతో కిటకిటలాడే ఈ చెక్‌పోస్టులో వాహనదారుల వద్ద అన్ని కాగితాలు, పర్మిట్‌లు ఉన్న వారి వద్ద నుంచి అక్రమంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒకవేళ డబ్బులు ఇవ్వని ఎడల ఇబ్బందులు పెడతారని, ఇబ్బందులు పడటం ఇష్ట లేక డబ్బులు ఇవ్వక తప్పడం లేదని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు చౌట్‌పల్లిలో శ్రీలక్ష్మీనారాయణ స్వామి జాతర


ముస్తాబవుతున్న చౌట్‌పల్లి శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం


కొలువుదీరిన శ్రీలక్ష్మీనారాయణస్వామి, శిలాశాసనం

కమ్మర్‌పల్లి, మే 22: మండలంలోని చౌట్‌పల్లి గ్రామ ఆలయంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనారాయణ స్వామి జాతరా ఉత్సవం గురువారం నిర్వహిస్తున్నటు అలయ అర్చకులు సముద్రాల అమర్‌నాథ్‌చారి, వేద పండితులు చౌట్‌పల్లి గంగాప్రసాద్ దీక్షితులు,గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కుంటరమేష్‌రెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం రోజు ఉదయం అంకుర్పాన,ధ్వజారోహనంతోమధ్యాహ్నం స్వామి వారికి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం ఉంటుందన్నారు. కాగాఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు తెలిపారు.జాతర ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. జాతర రోజు ఆలయం వద్ద శ్రీలక్ష్మీనారాయణ స్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

● ఆలయ నేపథ్యం

అగస్య మహాముని గోదావరి పరివాహక ప్రాంతంలో తపస్సు చేస్తు మూడు శ్రీలక్ష్మీనారాయణ స్వామి అలయాలు నిర్మించాలని ఉపదేశించగా అందులో బాగంగానే లక్ష్మీపురి ప్రస్తుతం చౌట్‌పల్లి గ్రామంలో ఈ అలయాన్ని కాకతీయ రాజులు నిర్మించారని,రెండవది మంత్రపురిలో (ప్రస్తుతం కరీంనగర్ జిల్లా మంథని) మూడోవది జైనత్‌లో ప్రస్తుతం అదిలాబాద్ జిల్లా జనత్ మండలంలో అలయాలు నిర్మించానట్లు పూర్వీకుల కథనం. చౌట్‌పల్లిలో ఈఅలయాన్ని క్రీ.శ.1870 లో నిర్మించినట్లు అలయం వెనుకభాగంలో శిలాశాసనం సంస్కృత భషలో ఉంది. దాని ఫైసన్ 1277 శుక్లనామ సంవత్సరం మాగ శుద్ధ దశమిగా దాని సారాంశంగా గ్రామ కురువృద్ధులు చెప్పుకుంటారు. కాకతీయుల కాలంలో నిర్మితమైన ఈ అలయం తదుపరి కేతిరెడ్డి వంశీయుల అద్వర్యంలో అభివృద్ధి చెందినట్లుగా చెప్పుకుంటారు ఈ అలయంలో అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం వైశాఖ పూర్ణిమ రోజు స్వామివారి కళ్యాణం, రథోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు. తిరురుమల తిరుపతి దేవాస్థానంలో మాదిరి ప్రతీరోజు ఉదయం సాయంత్రం స్వామివారి పల్లకీ ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

కరెంట్ కోతలతో ఉక్కిరి బిక్కిరి


మద్నూర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్

మద్నూర్, మే 22: ఉమ్మడి మద్నూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ కోతలతో జనాలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఒకవైపు వర్షాలు, మరో వైపు ఎండలు, కారు మబ్బులు కాస్తుండటంతో కరెంట్ సరఫరా నిలిపివేస్తుండటంతో ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. గత కొన్ని రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు, వ్యాపారస్తులు, తదితర చిరువ్యాపారులు ఆందోళన చెందు తున్నారు. కరెంట్ కోతల కారణంగా తాగు నీటి సరఫరాకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఎండలు, వర్షాలకు ఉక్కిరి బిక్కిరి అవుతున్న జనం కరెంట్ కోతలతో మరింత ఇబ్బందులు పడుతున్నారు.

● చీటికి మాటికి కరెంట్ పోతుంది

కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. బయటకు వెళ్లలేక, ఇంట్లో ఉండలేక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.రాత్రివేళలో కరెంట్ పోయిన సమయంలో చిన్నారులు, వృద్ధులు నిద్రపోవడం లేదు. కరెంట్ వచ్చే వరకు జాగారం చేయా ల్సిన దుస్థితి నెలకొంది. పట్టణ ప్రాంతాల కన్నా గ్రామీణ ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎండకాలంలో సహజంగా విద్యుత్ వినియోగం పెరుగుతుంది. అనధికారికంగా కోతలు మొదలయ్యాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. కూరగాయలు, తదితర పంటలు పండిస్తున్న వారు పడిగాపులు కాస్తున్నారు. ఒక్కొక్క సారి చీటికి మాటికి కరెంట్ పోతుండటంతో లైట్ బుగ్గలు కాలిపోవడం, ఫ్యాన్లు చెడిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గాలి దుమారం కారణంగా విద్యుత్ వైర్లు ఒకటికి ఒకటి తగిలి అక్కడక్కడ ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. వాటి కోసం ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ వైర్ల మరమ్మతులు చేస్తే కరెంట్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులుం డవని ప్రజలు అంటున్నారు. అధికారులు స్పందించి కరెంట్ సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా?


ప్రమాదకరంగా ఉన్న గుంత


మూల మలుపులో ఉన్న గుంత

రెంజల్,మే22: రెంజల్ మండలంలోని తాడ్ బిలోలి, బోర్గాం వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బోధన్ నుంచి బాసర వెళ్లే ప్రధాన రహదారిపై ఉండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.పదుల సంఖ్యలో గుంతలు ఉండడంతో ప్రయాణికులు ఈ రోడ్డు గుండా ప్రయాణం సాగించాలంటే ఇబ్బంది పడుతున్నారు. నెలలు గడుస్తున్న ఆర్అండ్‌బీ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్న ఫలితం లేదన్నారు. ప్రధాన రహదారిగుంతలమయమైన కూడా అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.రోడ్డుపైఉన్న గుంతలను త్వరగా పూడ్చి వేయాలన్నారు.

'ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి'


బషారాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ మల్లయ్య

కమ్మర్‌పల్లి, మే 22: వరి కొనుగోల్లో సగం పెంచాలని భీమ్‌గల్ ఏడీఏ కే మల్లయ్య అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలో చౌట్‌పలి సహకారసంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాన్ని మండలవ్యవసాయాధికారి లావణ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంద్వారా ఇప్పటి వరకు తూకం వేసిన వరి వివరాలను అడిగి తెలుసుకున్నారు.గన్నీబ్యాగ్‌ల నిలువలను, తూకం వేసే హమాలీల సంఖ్యను ఆయన పరిశీలించారు. వారంలోగా వరికొనుగోల్లను పూర్తిచేసి సంబంధిత మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రం ఇన్‌చార్జి మారుతికి ఆదేశాలు జారీ చేశారు.కాగా అకాల వర్షాల కారణంగా రైతులు తాము కొనుగోలు కేంద్రాలకు తరలించిన వరి ధాన్యం కుప్పలు తడవకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు ఏడీఏ వెంట ఏవో లావణ్య, ఏఈవోలు కావ్య, పద్మ, స్థానిక రైతులు సెంటర్ బాధ్యులు ఉన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు అందేలా చూడాలి


పిప్రిలో రిజిష్టర్‌లను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అశోక్

ఆర్మూర్‌రూరల్, మే22: వ్యాధి నిరోధక టీకాలు ప్రతీఒక్క చిన్నారికి తప్పకుండా అందేలా చూడాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అశోక్ అన్నారు. బుధవారం ఆర్మూర్ మండలంలోని ఫత్తేపూర్, పిప్రి గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్‌తో కలిసి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల లబ్ధిదారుల జాబితాను ముందస్తుగా తయారు చేసుకొని ప్రతీ చిన్నారికి టీకాలు వేసే విధంగా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఎండలు అధికంగా ఉన్నందున వ్యాక్సిన్ కోల్డ్‌చైన్ పాటించాలన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు అధికంగా జరిగేలా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించాలన్నారు.ఈకార్యక్రమంలో ఆర్మూర్ సబ్‌యూనిట్ అధికారి సాయి, ఆరోగ్యకార్యకర్తలు, ఆశకార్యకర్తలు పాల్గొ న్నారు.

కొనసాగుతున్న కబడ్డీ శిక్షణ శిబిరం


ముప్కాల్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ముప్కాల్, మే22: ముప్కాల్ మండల కేంద్రంలోని చైతన్య నెహ్రూ యువ జన సంఘ క్రీడా మైదానంలో జూనియర్ బాలుర కబడ్డీ శిక్షణ శిబిరం కొనసాగుతుంది. బుధవారం వేసవి సెలవుల దృష్ట్యా విద్యార్థులకు కబడ్డీలో మంచి నైపుణ్యం సాధించడానికి ఏర్పాటు చేసిన అండర్-16, అండర్-14 విభాగాల్లో 50మంది క్రీడాకారులకు పీడీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియంలో విద్యార్థులకు ఉచిత భోజన సౌకర్యంతో పాటు కబడ్డీలో మంచి నైపుణ్యం అందిస్తున్నట్టు పీడీ తెలిపారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి


భిక్కనూరులో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్ రావు

భిక్కనూరు, మే 22: గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డీపీవో శ్రీనివాస్‌రావు గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించాలని, ఏదైనా నీటి సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని, ఉపాధిహామీ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి పని కల్పించాలని, ఉపాధిహామీ పని జరుగుతున్న చోట కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏపీవో రాధిక, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు మద్నూర్‌లో రథోత్సవం


ముస్తాబు చేసిన రథం

మద్నూర్, మే 22: మండల కేంద్రంలోని లక్ష్మీ నారాయణ మందిరంలో వైభవంగా జరుపుకునే రథోత్సవ ఏర్పాట్లు పూర్తి చేశారు. 23, 24 తేదిల్లో రథోత్సవం జరుగనుంది. బుద్ద పౌర్ణమి నాడు ప్రతియేడాది ఆనవాయితీగా నిర్వహిస్తారు. గ్రామంలో రథాన్ని ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 24న కుస్తీ పోటీలు జరుగుతాయి. రథోత్సవాన్ని తిలకించడానికి మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భక్తులు వస్తారు. పూర్వ కాలం నాటి రథానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. సుమారు 500 ఏండ్ల క్రితం రథం ఇప్పటికి చెక్కు చెదర కుండా ఉండటంతో చుట్టూ పక్కల వంద కిలో మీటర్ల దూరం ఇలాంటి రథం లేకపోవడంతో భక్తులు తరలివస్తారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లుచేశామని నిర్వాహకులు తెలిపారు. రథం గల్లీలో జాతర ఉంటుందని తెలిపారు.

బీడీ టేకేదార్ పై చర్యలు తీసుకోవాలని ఆందోళన

డిచ్‌పల్లి,మే 22: ఇందల్వాయి మండల కేంద్రంలో చార్‌బాయి బీడీ కార్ఖన టేకేదార్ వైకుంఠం మహిళ బీడీ కార్మికులను దూషిస్తు ఇబ్బందులకు గురి చేస్తున్నడని ఆరోపిస్తు బీడీ కార్మికులు బుధవారం మండల కేంద్రంలోని చార్‌భై సెంటర్ కార్ఖన ఎదుట ఆందోళన చేశారు. తాను చెప్పింది వినాలని టీ కేదార్ వైకుంఠం బెదిరిస్తున్నాడని తక్షణమే ఆయన పై చర్యలు తీసుకోవాలని కార్ఖన యాజమన్యానికి వినతి పత్రంఅందజేశారు.



హన్మాజీపేట్‌లో డ్రైనేజీ పనులను ప్రారంభించిన దృశ్యం

హన్మాజీపేట్‌లో డ్రైనేజీ పనుల ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బాన్సువాడ, మే 22: మండలంలోని 'హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య లోపం డ్రైనేజీలు అస్తవ్యస్తం' అనే కథనం ఈనెల 29న 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించి అధికారులు, ఆసుపత్రి కమిటీ సభ్యులు వెంటనే అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ పైప్‌లైన్ నూతనంగా ఏర్పాటు చేసేందుకు పనులను ప్రారంభించారు. ఆసుపత్రిలో దుర్వాసన డ్రైనేజీ పైప్‌లైన్ పూర్తిగా చెడిపోవడంతో ఎక్కడికక్కడ మురికి నీరు చేరి దుర్వాసన నెలకొంది. దీంతో రోగులకు ఆసుపత్రి, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా డ్రైనేజీ పనులను పూర్తి చేసి ఆసుపత్రిలో ఎలాంటి పారిశుధ్య లోపం లేకుండా చర్యలు చేపడుతున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అటు ఆసుపత్రి సిబ్బంది ఇటు రోగులు అభినందనలు తెలిపారు.

రేపు పాలిసెట్ ప్రవేశపరీక్ష

కామారెడ్డి టౌన్, మే 22: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే పాలిసెట్ ప్రవేశపరీక్ష ఈనెల 24న నిర్వహించనున్నట్లు బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. కామారెడ్డి పట్టణంలో మొత్తం 4 కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు కేంద్రాలు, సాందీపని డిగ్రీ కళాశాల, ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాలలో ఒకటి చొప్పున పరీక్ష కేంద్రాలలో మొత్తం 2301 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి ఉదయం 10 గంటల నుంచి అనుమతిస్తారని పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యమైన లోనికి అనుమతి ఉండదని తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్‌తో పాటు హెచ్‌బీ పెన్సిల్, బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ వెంట తెచ్చుకోవాలని తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌పై ఫొటో ముద్రించి ఉండకపోతే పాస్‌పోర్టు సైజ్ ఫొటో, గుర్తింపు కార్డు, ఆధార్ వెంట తెచ్చుకోవాలని తెలిపారు.



పద్మాజీవాడి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పద్మాజీవాడిలో సెంట్రల్ సెక్రెటేరియట్ టీం పర్యటన

సదాశివనగర్, మే 22: పద్మాజీవాడి గ్రామంలో బుధవారం సెంట్రల్ సెక్రెటేరియట్ టీం పర్యటించారు. గ్రామంలో నాలుగు రోజుల పాటు సందర్శించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను, మౌలిక వసతుల వివరాలను గ్రామస్థుల నుంచి సేకరించి పై అధికారులకు అందించనున్నారు. గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌ను, గాయత్రీ షుగర్స్ ఫ్యాక్టరీని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ సర్కిల్ ఏఈ ద్వారా పూర్తి వివరాలు సేకరించి తెలుసుకున్నారు. ధర్మారావుపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను సందర్శించి అక్కడ వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీవో సురేందర్‌రెడ్డి, ఏపీవో మధు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



కిష్టాపూర్‌లో నల్ల పోచమ్మ భాగవతాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

అలరించిన నల్ల పోచమ్మ భాగవతం

బీర్కూర్, మే 22: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో రథోత్సవం సందర్భంగా నల్ల పోచమ్మ భాగవతం నాటక రూపంలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను తిలకించేందుకు భక్తులు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నాటక ప్రదర్శన మూడు రోజుల పాటు రాత్రి వేళల్లో కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. నల్ల పోచమ్మ అమ్మ వారి జీవిత చరిత్రను నాటక రూపంలో ప్రదర్శిస్తున్నారు. వివిధ దేవతల వేషధారణ చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రతీయేటా పున్నమి సందర్భంగా ఆంజనేయ స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. ఇందులో భాగంగా కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

పోస్టింగ్స్ కోసం గురుకుల ఉపాధ్యాయుల ఎదురుచూపు

- అడ్డంకిగా మారిన ఎలక్షన్ కోడ్
- త్వరగా ఇవ్వాలని అభ్యర్థుల వేడుకోలు

భిక్కనూరు, మే 22: అహర్నిషలు కష్టపడి ఉద్యోగం సాధించిన గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇప్పటి వరకు పలు కారణాలతో పోస్టింగ్‌లు ఇవ్వలేదు. గత మార్చి 4న హైదారాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా 9 వేలకు పైగా నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులకు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉన్న ఎన్నికల కోడ్ కారణంగా పోస్టింగ్‌లు ఇవ్వలేదు. దీంతో త్వరలోనే కోడ్ ముగిస్తుండడం, జూన్‌లో పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమవుతుండగా నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులు గురుకుల బోర్డు చుట్టూ తిరుగుతూ వెంటనే పోస్టింగ్‌లను ఇవ్వాలని అధికారులను వేడుకుంటున్నారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలు ముగిసినప్పటికీ ఏ క్షణంలో నైనా గ్రామ పంచాయతీ ఎన్నికలు వస్తాయన్నా ఊహాగానాలతో పోస్టింగ్‌లు ఇవ్వడం ఆలస్యం అతువుతుందేమోనని ఉమ్మడి జిల్లాలోని నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు.

అడ్డంకిగా మారిన ఎన్నికల కోడ్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో అమలులో ఉన్న ఎన్నికల కోడ్ నూతనంగా ఉద్యోగం సాధించిన గురుకుల ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు ఇవ్వడానికి అడ్డంకిగా మారింది. జూన్ మొదటి వారంలో కోడ్ ముగియనున్న నేపథ్యంలో వెంటనే గురుకుల పాఠశాలల్లో ప్రమోషన్లను, ట్రాన్స్‌ఫర్‌లను చేపట్టాలని (ఇలా చేస్తేనే పోస్టింగ్‌ల విషయంలో స్పష్టత వస్తుందని), నియామకపత్రాలు అందుకున్న ఉపాధ్యాయులకు కనీసం 10 రోజుల పాటు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని ఆ శిక్షణను సైతం పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఆందోళన చెందుతున్న అభ్యర్థులు

గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులుగా నియామకమైన వారిలో చాలా వరకు మధ్య వయస్సు కలిగిన వారే ఉండటంతో వారి పిల్లల చదువుల పట్ల ఆందోళన చెందుతున్నారు. జూన్ రెండవ వారంలోపు పోస్టింగ్‌లు ఇస్తే తమ కుటుంబాన్ని తమ వెంట తీసుకువెళ్లవచ్చునని లేదంటే తాము ఒకచోట, తమ కుటుంబ ఒక చోట ఉండే పరిస్థితి తలెత్తుతుందని దీంతో తమ పిల్లల చదువులకు ఇబ్బందులు వస్తాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఉద్యోగం వచ్చి నియామక పత్రాలు తీసుకోగానే ఇది వరకు పని చేసిన ప్రాంతాల్లో తమను తొగించారని అప్పటి నుంచి పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తూ ఇంటి వద్దనే ఉంటున్నామని, ఇంటి వద్దనే ఉండటంతో తమ ఆర్థిక పరిస్థితులు సైతం బాగాలేవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీవో

కొలతల ప్రకారం పనులు చేయాలి

రాజంపేట, మే 22: కొలతల ప్రకారం పనులు చేయాలని ఎంపీవో వినోద్ అన్నారు. మండలంలోని ఆర్గొండ గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించి కొన్ని విషయాలపై అవగాహన కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఉపాధి కూలీలకు కొలతల ప్రకారం పనులు చేయించాలని ఎండలు తీవ్రంగా ఉండడంతో కూలీలకు సదుపాయాలు కల్పించాలని ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు పనులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఏ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, ఫీల్డ్ అసిస్టెంట్ గోపి పాల్గొన్నారు.

సైబర్‌నేరాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలి

- ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డిటౌన్, మే 22: సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఎస్పీ సింధూశర్మ అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని డీఎస్పీ, సీఐ, ఎస్ఐలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గంజాయి అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగ్‌లు, జూదం, మట్కాలాంటి అసాంఘిక కార్యకలపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతికేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకుర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడు రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం తాగి వాహనాలను నడుపుతూ ర్యాష్ డ్రైవింగ్ చేస్తు రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కేసులు నమోదుచేసి కఠినచర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. అనంతరం విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్, ఎస్ఐ ఉస్మాన్, ఎస్ఐలు మహేందర్,సుభాష్‌గౌడ్, సయ్యదుద్దీన్,సురేందర్, కిషన్, షైసయ్య, శ్రావణ్‌కుమార్, రాజేంద్రకుమార్, గణపతి, శ్రీనివాస్, వెంకటరాములు, శ్రీనివాస్, సుప్రజా, రవి, శ్రీనివాస్‌రావు, మహేందర్, సంతోష్, బుచ్చయ్య, తిరుపతి, సాయిబాబా, వసి, కిషన్, నరేష్‌లకు అవార్డులతో పాటు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ట్రైని ఐపీఎస్ కాజోల్‌సింగ్, డీఎస్పీలు నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ తిరుపయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సింధూశర్మ

జంగంపల్లి శివారులో ఆటో బోల్తా

- ఒకరి మృతి
- పదిమందికి గాయాలు

భిక్కనూరు, మే 22: అతివేగంగా ఆటోనడపటంతో ఆటో బోల్తా పడి ఒకరు మృతిచెందగా మరికొంత మందికి గాయాలైన సంఘటన మండలంలోని జంగంపల్లి శివారులో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేట మండలంలోని ఆరేపల్లి గ్రామానికి ఆశావర్కర్ సవిత(కొండాపూర్), తన కొడుకు విష్ణువర్ధన్‌తో పాటుగా మరికొంతమందితో కామారెడ్డి నుండి తలమడ్ల గ్రామానికి చెందిన గడ్డం గంగారాంకు చెందిన ఆటోలో వెళ్తుండగా జంగంపల్లి గ్రామశివారులో ఆటో అతివేగంగా వెళ్లడంతో ఒక్కసారిగా ఆటో బోల్తాపడి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటుగా ఆటోల ఉన్న వారందరికి గాయాలయ్యాయి. వెంటనే వీరిని చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆశావర్కర్ సవిత మృతిచెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

మొక్కలను సురక్షితంగా ఉంచాలి

తాడ్వాయి, మే 22: నర్సరీలలో మొక్కలను సురక్షితంగా ఉంచాలని ఎంపీడీవో సాజిద్‌అలీ అన్నారు. మండలంలెపి బ్రహ్మాజీవాడి, కృష్ణాజీవాడి గ్రామాల్లో ఆయన బుధవారం నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నర్సరీలలో పెంచే మొక్కలు చనిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన సమయంలో నీటిని అందిస్తు రక్షించాలని సూచించారు. ఎన్ని మొక్కలు ఉన్నాయో వివరాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఎస్‌సీబారాణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

కామారెడ్డిటౌన్, మే 22: పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా బూక్యబందర్, మాయం రాజయ్యఅనే ఇద్దరు వ్యక్తులకు ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ప్రతాప్ రెండురోజుల జైలుశిక్ష, జరిమానాను విధించినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఎల్ఓసీ అందజేత

రామారెడ్డి, మే 22: మండలంలోని రాజమ్మతండా గ్రామానికి చెందిన భూక్యలావణ్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆమె ఆపరేషన్ నిమిత్తం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రూ.4లక్షలు చికిత్స నిమిత్తం ఎల్ఓసీని బాధిత కుటుంబసభ్యులకు అందించారు.ఈ సందర్భంగా కుటుంబీకులు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మాగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శిలాసాగర్‌లతో పాటు పలువురు కాంగ్రెస్‌నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవో

లింగంపేట, మే 22: మండలంలోని ఎల్లారం, ఎల్లమ్మతండా, జగదాంబ తండాలలోని నర్సరీలను, కంపోస్ట్ షెడ్‌లను బుధవారం ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. నర్సరీలలో మొక్కలను ఏపుగా పెంచాలని, కంపోస్టు షెడ్లను వినియోగంలోకి తేవాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు.

ఆలయంలో కొనసాగుతున్నపూజలు

భిక్కనూరు, మే 22: మండల కేంద్రంలోని శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో ఉడిపి పండితుల ఆధ్వర్యంలో చేపట్టినవాస్తు నివారణ పూజలు కొనసాగుతున్నాయి. ఇందులో బాగంగా బుధవారం స్వామివారికి ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అర్చకులు వేద పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు ఆలయానికి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ రాకా..

వాస్తునివారణ పూజల కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గురువారం ఆలయానికి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ రానున్నట్లు ఆలయకమిటీ ప్రతినిధులు బుధవారం తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలల్లో షబ్బీర్‌అలీ పాల్గొంటారని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వో పరామర్శ

ఎల్లారెడ్డి, మే 22: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన ప్యాలాల కృష్ణ కుమారుడు మణిదీప్ (10) మంగళవారం డెంగీతో మృతి చెందడంతో డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించి వారి వివరాలు తెలుసుకున్నారు. మణిదీప్ కుటుంబ సభ్యులు, ఇంటి చుట్టూ పక్కల నివసిస్తున్న 50 కుటుంబాల రక్త నమూనాలను సేకరించి వారికి మందులు పంపిణీ చేశారు. గురువారం కూడా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి తెలిపారు. మత్తమల్ పీహెచ్‌సీ డాక్టర్ శరత్, సూపర్ వైజర్ రాణి, ఆరోగ్య కార్యకర్త ఇందిరా, ఆశా కార్యకర్తలు సంధ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి మృతి

పిట్లం, మే 22: మండలంలోని బుర్నాపూర్ గ్రామానికి చెందిన హన్మంత్ రెడ్డి(65)అనే వ్యక్తి కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి మృతి చెందాడని ఎస్సై నరేష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. బుర్నాపూర్ గ్రామానికి చెందిన హన్మంత్‌రెడ్డి ఆరు నెలలుగా కడుపునొప్పి రావడంతో ఆసుపత్రుల్లో చికిత్స అయినప్పటికీ, కడుపునొప్పి తగ్గక పోవడంతో వారి ఇంటివద్ద గల గడ్డివాము వద్ద 16 తేదీన పురుగుల మందుతాగారని తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు నిజామాబాద్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని కొడుకు జలందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

చెరువుల్లో పూడికతీత పనులు

పిట్లం, మే 22: మండల కేంద్రంలోని పోతురెడ్డిపల్లి గ్రామ శివారులో గల పెద్దచెరువులో పూడికతీత పనులు ప్రారంభించామని కార్యదర్శి యాదగిరి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం కింద చెరువుల్లో కూలీలతో పూడికతీత పనులు చేయించడం జరుగుతుందని, రైతులకు చెరువులోని మట్టిని పంట పొలాలకు టాక్టర్‌లలో మట్టి నింపి రైతులకు అందివడం జరుగుతుందన్నారు. నల్లమట్టి పంటపొలాలో వేయడంతో పంటల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు.

పారిశుధ్యం పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పిట్లం, మే 22: మండలంలోని ప్రతి గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పారిశుద్ధ పనులు చేపట్టడం జరుగుతుందని ఎంపీవో బ్రహ్మం తెలిపారు. బుధవారం మండలంలోని మద్దెల్‌చెరు గ్రామంలో పారిశుధ్యం పనులను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో ప్లాస్టిక్ సేకరించడం జరుగుతుందని తెలిపారు.

ఆర్టీసీ బస్సు, వ్యాన్ ఢీ

లింగంపేట, మే 22: మండలంలోని మెంగారం అటవీ ప్రాంతంలో ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై బుధవారం ఆర్టీసీ బస్సు, వ్యాన్ ఎదురు ఎదురుగా ఢీకొన్నాయి. ఆర్టీసీ బస్సు ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డికి వెళ్లుతుండగా ఓమిని వ్యాన్ లింగంపేట నుంచి ఎల్లారెడ్డికి వెళ్లుతుంది. మెంగారం అటవి ప్రాతంలో రెండు ఎదురు ఎదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. వ్యాన్, బస్సు రెండు ఒకవైపు పూర్తిగా దెబ్బతిన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ

బిచ్కుంద, మే 22: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో బస్సు ఎక్కే క్రమంలో మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరికి గురైంది. బిర్కుర్‌కు చెందిన శకుంతల బిచ్కుందలోని బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో బస్సు ఎక్కుతుండగా గుర్తుతెలియని వ్యక్తి మెడలోంచి బంగారు పుస్తెలతాడు తెంచుకు పోయాడు. పోలీసులు సమాచారం ఇవ్వడంతో వారు బస్సులోని ప్రయాణికులను సోదా చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు.

నిప్పంటుకుని గడ్డి వాము దగ్ధం

పెద్దకొడప్‌గల్, మే 22: మండలంలోని పోచారం తండా పరిధిలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వరి గడ్డి వాముతో పాటు రెండు ఎడ్ల బండ్లు దగ్ధమయిన ఘటన ఒకటి చోటు చేసుకుంది. పోచారం తండాకు చెందిన బన్సిలాల్ గ్రామ శివారులో తన పొలంలో పశువుల మేత కోసం సుమారు 35వేల రూపాయల విలువగల వరి గడ్డిని కొని నిలువ ఉంచాడు. దీంతో పాటుగానే రెండు ఎడ్ల బండ్లు, కాడెద్దులను కూడ ఘటన స్థలంలోనే ఉంచాడు. మధ్యాహ్నం సమయంలో అనుకోకుండా చెలరేగిన మంటలతో వరి గడ్డి వాము పూర్తిగా దగ్ధం అయింది, దీంతో పాటుగానే రెండు ఎడ్ల బండ్లు కూడ అగ్నికి ఆహుతి అయ్యాయి. గ్రామస్థులు బిచ్కుంద అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఫైర్ ఇంజన్ ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు 70వేల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

మూగ జీవాలకు వైద్య సేవలు

పెద్ద కొడప్‌గల్, మే 22: మండలంలోని ఆయా గ్రామాలల్లో గల మూగ జీవాలకు పశువైద్య సిబ్బంది వైద్య సేవలను అందిస్తున్నారు. ఏదైనా గ్రామంలో మనుషులకు ఆరోగ్య సమస్యలు వస్తే 108కు ఫోన్ చేయగానే ఎలాగైతే వైద్య సేవలు అందిస్తున్నారో అదే మాదిరిగా గ్రామాల్లో గల మూగ జీవాలకు ఆరోగ్య సమస్యలు రాగానే ఆయా గ్రామాల ప్రజలు 1902 నెంబర్‌కు ఫోన్‌చేయగానే వైద్య సిబ్బంది సకాలంలో వచ్చి మూగ జీవాలకు వైద్య సేవలను అందిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జుక్కల్ నియోజక వర్గంలో గల మండలాలకు ఒక 1902 అంబులెన్స్ అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్యారా వెటర్నరీ సదాశివ్. హెల్పర్ గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్లాస్టిక్ సేకరణ

పెద్ద కొడప్‌గల్, మే 22: గ్రామాలను ప్లాస్టిక్‌రహిత గ్రామాలుగా మార్చేందుకు గాను ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలలోని ఆయా గ్రామాలలో ఇంటింటా ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమాన్ని పంచాయితీ సిబ్బంది నిర్వహించారు. గ్రామాల్లో గల ఇండ్ల నుంచి ప్లాస్టిక్‌ను సేకరించి దానిని కంపోస్ట్ షెడ్‌లో వేసి దానిని రీ సైక్లింగ్ చేసేందుకు గాను అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో మండలంలోని పంచాయతీ సిబ్బంది ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమానికి స్వీకారం చుట్టారు. విచ్చలవిడిగా గ్రామాలల్లో ప్లాస్టిక్ పెరిగిపోయి పారిశుధ్యం కుంటుపడకుండా ఉండేందుకు గాను ప్లాస్టిక్ సేకరణ చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. తాము సేకరించిన ప్లాస్టిక్‌ను కంపోస్ట్ షెడ్‌లో రీ సైక్లింగ్ అనంతరం అమ్మివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం సముందర్‌తండాలో పంచాయతీ కార్యదర్శితో కలిసి సిబ్బంది ఇంటింటా ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముగిసిన రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు

దోమకొండ, మే 22: మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు ముగిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం తిరుగు బోనాలు, పుట్ట ఎల్లమ్మ వద్ద పూజలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, సంఘం సభ్యులు నాగభూషణంగౌడ్, రాజనర్సాగౌడ్,కర్రోల్ల శ్యాంసుందర్‌గౌడ్, నర్సాగౌడ్, వెంకట్‌గౌడ్, రవిగౌడ్, హరిగౌడ్, యాదగౌడ్, బీమాగౌడ్, సుదర్శన్‌గౌడ్, ప్రసాద్‌గౌడ్, రామాగౌడ్, శ్రావణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

